# చైతన్య గళం
తెలుగు దిన పత్రిక

సంచిక :162 సంపుటి : 1 హైదరాబాద్ , రంగారెడ్డి, నాగర్ కర్నూల్ , మహబూబ్‌నగరం మంగళవారం 16-7 -2024 వెల : .రూ. 5.00



Pallavi Bhonagiri
Insurance Advisor
95330 82971
70137 85232
pallavibhongiri@gmail.com
Karmanghat, Hyderabad
Multi-Line Agent
Motor - Life - Health
We Find Your Best Rate


# నేరుగా రైతుల ఖాతాల్లోకే

## రైతు రుణమాఫీకి మార్గదర్శకాలు విడుదల

## రేషన్ కార్డు ఆధారంగా రైతుల గుర్తింపు



**హైదరాబాద్,15, జూలై(చైతన్యగళం):**

పంటల రుణమాఫీకి తెలంగాణ ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. కుటుంబానికి రూ.2లక్షల వరకు రుణమాఫీ వర్తిస్తుందని వ్యవసాయశాఖ స్పష్టం చేసింది. 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 13 వరకు తీసుకున్న పంట రుణాల బకాయిలకు మాత్రమే ఈ రుణమాఫీ వర్తిస్తుందని, రైతు కుటుంబం గుర్తింపునకు రేషన్‌కార్డు ప్రామాణికమని తెలిపింది. పంట రుణమాఫీ కోసం ప్రత్యేక వెబ్ పోర్టల్ ఏర్పాటు చేయనున్నారు. రుణమాఫీ నగదు నేరుగా లబ్దిదారుల రుణఖాతాల్లోనే జమకానుంది. ఆరోహణ క్రమంలో రుణమాఫీ సొమ్ము



-మిగతా 2 లో




## ఎగువసభలో తగ్గిన బిజెపి బలం

- రాజ్యసభలో 20 స్థానాలు ఖాళీ
- ఈ యేడే ఎన్నికల నిర్వహణ

**న్యూఢిల్లీ,15, జూలై(చైతన్యగళం):**

ప్రస్తుతానికి రాజ్యసభలో మొత్తం 20 స్థానాలు ఖాళీగా ఉన్నాయి. ఇందులో 11 మంది ఎన్నికైన సభ్యుల స్థానాలు ఉన్నాయి. ఆయా స్థానాలకు ఈ ఏడాదే ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. వీటిలో మహారాష్ట్ర, అసోం, బీహార్‌లలో 2, హర్యానా, రాజస్థాన్, మధ్యప్రదేశ్, తెలంగాణ, త్రిపురలలో ఒక్కొక్కటి చొప్పున ఉన్నాయి. బీజేపీ నేతృత్వంలోని కూటమి అసోం, బీహార్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, త్రిపురలలో 7 సీట్లు గెలిచే అవకాశం ఉంది. ఇక మహారాష్ట్రలోనూ రెండు స్థానాలు గెలిచే ఛాన్స్ ఉంది. ఈ ఏడు స్థానాలు, నామినేటెడ్ సభ్యులకు తోడు వైసీపీ మద్దతు ఇస్తే ఎన్డీయే కూటమి బిల్లులను గట్టెక్కించుకోగలుగుతుంది. ప్రస్తుత రాజ్యసభలో మొత్తం సభ్యుల సంఖ్య 225గా ఉంది. కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా బలం

-మిగతా 2 లో



## రామసేతు వంతెన కాల్పనికం కాదు

- అది నిజమైన సేతువే ..నిర్ధారించిన ఇస్రో


**శ్రీహరికోట,** భారత్, శ్రీలంకల మధ్య రామసేతు వంతెన కాల్పనికం కాదని, నిజమేనని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) తెలిపింది. ఇస్రో శాస్త్రవేత్తలు అమెరికాకు చెందిన ఐస్‌శాట్ 2 డేటాను వినియోగించి తమిళనాడు లోని ఈ వంతెనకు

-మిగతా 2 లో

# స్థానిక ఎన్నికలపై సీఎం రేవంత్ దృష్టి



- బిసి రిజర్వేషన్ల పెంపునకు కార్యాచరణ
- సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష





**హైదరాబాద్,15, జూలై(చైతన్యగళం):**

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల పెంపునకు సంబంధించి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. పంచాయతీల ఎన్నికలకు సంబంధించి బీసీ రిజర్వేషన్ల పెంపుపై సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్ల అమలు, రాబోయే ఎన్నికల్లో వాటి పెంపునకు సంబంధించిన అంశాలను వెల్లడించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. గత పంచాయతీ ఎన్నికల అనుసరించిన విధానం, రానున్న పంచాయతీ ఎన్నికలకు సన్నద్ధమవుతున్న తీరును అధికారులు సీఎం రేవంత్‌కు వివరించారు. ఇప్పటికే కుల గణనకు ఆమోదం తెలిపినందున, దాని ఆధారంగా పంచాయతీ ఎన్నికలకు వెళ్తే ఎలా ఉంటుందని,

-మిగతా 2 లో




## సచివాలయ ముట్టడికి యత్నించిన బిసి జనసభ

- సచివాయంలోకి చొచ్చుకుని పోయే యత్నం
- రాజారాం యాదవ్ తదితరుల అరెస్ట్
- అరెస్టులను ఖండించిన కెటిఆర్

**15, జూలై(చైతన్యగళం):హైదరాబాద్,**

తెలంగాణ సెక్రటేరియట్ వద్ద సోమవారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. డీఎస్సీ పరీక్షలు వాయిదా వేయడం సహా, బీసీ కులగణన, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు వంటి ప్రధాన డిమాండ్లతో బీసీ జనసభ నాయకులు, నిరుద్యోగులు సచివాలయం వద్దకు చేరుకుని

-మిగతా 2 లో



## మరో ఐదు రోజులపాటు భారీ వర్షాలు

- ఉప్పొంగుతున్న హుస్సేన్‌సాగర్
- ఒక్కరోజు వర్షానికే నిండుకుండలా సాగరం

**హైదరాబాద్,15, జూలై(చైతన్యగళం):**

ఆదివారం కురిసిన భారీ వర్షానికి హైదరాబాద్‌లోని హుస్సేన్‌సాగర్ నిండుకుండలా మారింది. జలాశయంలోకి ఎగువ నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. హుస్సేన్‌సాగర్ జలాశయం పూర్తి

-మిగతా 2 లో

## ప్రజాస్వామ్యానికి గంతలు కట్టి కొల్లగొట్టారు



- గనలును దోచేశారు..భూములను లాగేశారు
- ఫేక్ డాక్యుమెంట్లతో అడ్డంగా దోచుకున్నారు
- గనుల శాఖపై శ్వేతపత్రం విడుదల చేసిన చంద్రబాబు

**అమరావతి,15, జూలై(చైతన్యగళం):**

సహజ వనరులైన భూములు, గనులు, అటవీ సంపదపై కూటమి ప్రభుత్వం సోమవారం శ్వేతపత్రం విడుదల చేసింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ... ప్రజాస్వామ్యానికి గంతలు కట్టి ఆఫీసుల పేరుతో కొట్టేశారన్నారు. చివరకు ల్యాండ్‌ను ఎవ్వరిని అడగకుండా దోచేసేందుకు ఓ ల్యాండ్ టైటలింగ్ యాక్ట్ తెచ్చారని మండిపడ్డారు. గనులశాఖపై సిఎం చంద్రబాబు శ్వేతపత్రం విడుదల చేశారు. విశాఖపట్నంలో ఇచ్చిన రామానాయుడు స్టూడియోను రెసిడెన్సియల్

-మిగతా 2 లో

# రామసేతు వంతెన కాల్పనికం కాదు

(మొదటి తరువాయి)

సంబంధించిన మ్యాప్‌ను విడుదల చేశారు. భారత్, శ్రీలంక మధ్య ఉండే ఈ వంతెన పొడవు 29 కిమీ ఉండగా, ఎత్తు సముద్ర గర్భం నుంచి 8 మీటర్లు ఉన్నట్టు నిర్ధారించారు. ఈ వంతెన తమిళనాడులోని రామేశ్వరం ద్వీపం ఆగ్నేయ దిక్కులోని ధనుష్కోడి నుంచి శ్రీలంక మన్నారు ద్వీపంలోని తలైమన్నార్ వాయువ్య దిశ వరకు విస్తరించి ఉంది. దీనిని సున్నపురాతితో నిర్మించినట్టు తెలుసుకున్నారు. ప్రస్తుతం ఈ సేతువు 99.98 శాతం నీటిలో మునిగి ఉందని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు.

# సచివాలయ ముట్టడికి యత్నించిన బిసి జనసభ

(మొదటి తరువాయి)

ఆందోళనకు దిగారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ సచివాలయంలోకి వెళ్లేందుకు యత్నించగా వారిని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో తోపులాట చోటు చేసుకుంది. పోలీసులతో వారు వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాం యాదవ్ సహా ఆందోళన కారులను అరెస్ట్ చేసి డీసీఎం వాహనంలో పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నిరుద్యోగుల సెక్రటేరియట్ ముట్టడి పిలుపులో భాగంగా బీసీ జనసభ కార్యకర్తలు సచివాలయంలోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నిం చారు. ఈ క్రమంలో నిరుద్యోగలు, జనసభ కార్యకర్తలు, పోలీసులకు మధ్య తోపులాట చోటుచేసుకున్నది. సెక్రటేరియట్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించిన బీసీ జనసభ కార్యకర్తలను పోలీసులు పట్టుకున్నారు. సీఎం రేవంత్ రెడ్డి, ప్రభుత్వానికి వ్యతిరేక నినాదాలతో హోరెత్తింది. జనసభ అధ్యక్షుడు రాజారాం యాదవ్ సహా కార్యకర్తలను అరెస్టు చేసి అక్కడి నుంచి తరలించారు. ఈ క్రమంలో డీఎస్సీని వాయిదా వేయాలని రాజారాం యాదవ్ డిమాండ్ చేశారు. డీఎస్సీని వాయిదావేయకపోతే సీఎం రేవంత్ రెడ్డి ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. కాగా, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు ఏటా రెండు లక్షల ఉద్యోగాల భర్తీ, జాబ్ క్యాలెండర్ విడుదల, మెగా డీఎస్సీ నోటిఫికేషన్, గ్రూప్ 2, 3 పోస్టుల పెంపు, డీఎస్సీ పరీక్షల వాయిదా, గ్రూప్-1 మెయిన్‌కు 1:100 పద్ధతిలో అభ్యర్థులను పిలవాలనే డిమాండ్లతో నిరుద్యోగులు, ఉద్యోగార్థులు రాష్ట్ర సచివాలయం ముట్టడికి పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో సెక్రటేరియట్ పోలీసుల వలయంలోకి వెళ్లింది. పెద్ద సంఖ్యలో విద్యార్థులు తరలిరానున్న నేపథ్యంలో సచివాలయం వద్ద భారీగా పోలీసులును మోహరించారు. బాహుబలి బారికేడ్లు, ఇనుపకంచెలు, వాటర్ క్యానన్లను ఏర్పాటు చేశారు. రాష్ట్రం నలుమూలల నుంచి సచివాలయ ముట్టడికి తరలివస్తున్న విద్యార్థులు, నిరుద్యోగులను పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టు చేసారు.

# మరో ఐదు రోజులపాటు భారీ వర్షాలు

(మొదటి తరువాయి)

స్థాయి నీటిమట్టం 514 అడుగులు. ప్రస్తుతానికి నీటి మట్టం 513 అడుగులు దాటింది. ఎగువన కురుస్తున్న వర్షాలకు వరద నీరు మొత్తం హుస్సేన్‌సాగర్‌లో చేరుతోంది. కూకట్‌పల్లి, బంజార, బుల్కాపూర్ నాలాల నుంచి భారీగా వరద వస్తోంది. హుస్సేన్ సాగర్ 2 గేట్లు ఎత్తి వరదనీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నీటిమట్టం పెరిగితే ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశంపై జీహెచ్‌ఎంసీ అధికారులు పరిశీలన చేశారు. మళ్లీ రానున్న 24 గంటల్లో వర్షాలు కురిసే నేపథ్యంలో ముంపునకు గురయ్యే కవాడిగూడ, మిగిలిన ప్రాంతాల ప్రజలనూ జీహెచ్‌ఎంసీ అధికారులు అప్రమత్తం చేశారు. నైరుతి రుతుపవనాల కారణంగా ఇప్పటికే రెండు తెలుగు రాష్ట్రాల్లో జోరు వానలు కురుస్తున్నాయి. నేటి నుంచి ఐదు రోజుల పాటు తెలుగురాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. నైరుతి రుతుపవనాలు బలపడటానికి తోడు.. అల్ప పీడన ప్రభావంతో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని చెప్పారు. ఈ వర్షాలు ఈ రోజు నుంచి ఐదు రోజుల పాటు అంటే జులై 18 వరకు ఈ వర్షాలు పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని కొన్ని జిల్లాలకు వర్ష సూచన చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో నైరుతి రుతుపవనాలకు తోడు ఆవర్తనం ప్రభావంతో వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం చెప్పింది. ఏపీకి భారీ వర్షసూచన చేసింది వాతావరణశాఖ. రాష్ట్రంలో అల్లూరి సీతరామరాజు, ఎన్టీఆర్, కృష్ణ, ఏలూరు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ను అమరావతి వాతావరణ శాఖ జారీ చేసింది. ఇక ఏపీలో మిగిలిన జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. నేడు, రేపు కోస్తా జిల్లాల్లో భారీవర్షాలు కురిసే అవకాశం ఉండగా.. అలాగే, రాయలసీమలో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. పిడుగులతో కూడిన భారీ వర్షాలు పడే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గంటకు 30-40 కి.మీ వేగంతో ఈదురు గాలులు వీస్తాయని తెలిపింది. భారీ వర్షాల నేపథ్యంలో మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని హెచ్చరించింది. రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని ఆంధప్రదేశ్ విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది.

తెలంగాణాకు భారీ వర్ష సూచన

÷లంగాణలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. తెలంగాణ రాష్ట్రంలో ప్రధానంగా పశ్చిమ, నైరుతి దిశల నుండి ఎక్కువ స్థాయిలో గాలులు వీచే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో కొత్తగూడెం, ఖమ్మం, సూర్యపేట, మహబూబాబాద్ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేయగా.. మిగిలిన జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. బలమైన నైరుతి రుతుపవనాలకు తోడు.. సముద్ర మట్టానికి 3.1కి.మీ. నుంచి 7.6 కి.మీ. మధ్యలో ఆవర్తనం కొనసాగుతుందని వాతావరణశాఖ చెప్పింది. రాష్ట్రంలో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని.. పలుచోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది.

# నేరుగా రైతుల ఖాతాల్లోకే

(మొదటి తరువాయి)

విడుదల చేస్తారు. ఎస్‌హెచ్‌జీ, జేఎల్‌జీ, ఆర్‌ఎంజీ, ఎల్‌ఈసీఎస్ రుణాలకు, రీషెడ్యూల్ చేసిన రుణాలకు మాఫీ వర్తించదు. రుణమాఫీపై రైతుల సందేహాలు తీర్చేందుకు ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. రైతు సమస్యలు ఉంటే 30 రోజుల్లో పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. మరిన్ని వివరాలకు వెబ్ పోర్టల్ చూడొచ్చు. లేదా మండల సహాయ కేంద్రాలను సంప్రదించవచ్చని తెలిపింది. అన్ని వాణిజ్య బ్యాంకులు, గ్రామీణ బ్యాంకులు, జిల్లా సహకార బ్యాంకుల నుంచి రైతులు ఈ కాలంలో రుణాలు తీసుకుంటే వారికి కూడా రుణమాఫీ వర్తించనుంది. వ్యవసాయశాఖ కమిషనర్, సంచాలకులు (డీఓఏ) పంట రుణమాఫీ 2024 పథకాన్ని అమలు చేస్తారు. హైదరాబాద్‌లో గల నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ (ఎన్ఐసీ) ఈ పథకానికి భాగస్వామిగా ఉంటుంది. వ్యవసాయశాఖ సంచాలకులు, ఎన్ఐసీ కలిసి ఐటి పోర్టల్ నిర్వహిస్తారు. ఆ పోర్టల్‌లో ప్రతి రైతు కుటుంబానికి సంబంధించిన లోన్ అకౌంట్ డేటా సేకరణ, డేటా వాలిడేషన్, అర్హత మొత్తాన్ని నిర్ణయించడానికి సౌకర్యం ఉంటుంది. ఐటి పోర్టల్ ఆర్థికశాఖ నిర్వహించే ఐఎఫ్‌ఎంఐఎస్ పోర్టల్‌కి బిల్లులు సమర్పించడం, పథకానికి సంబంధించిన భాగస్వాములతో సమాచారం పంచుకోవడం, రైతులు ఇచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేకమైన మాడ్యూల్స్ ఉంటాయి. పథకం అమలు కోసం ప్రతి బ్యాంకులో ఒక అధికారిని బ్యాంకు నోడల్ అధికారిగా (బీఎస్) నియమిస్తారు. బ్యాంకు నోడల్ అధికారి బ్యాంకులకు వ్యవసాయశాఖ సంచాలకులు, ఎన్ఐసీ మధ్య సమన్వయకర్తగా వ్యవహరిస్తారు. బ్యాంక్ నోడల్ అధికారులు తమ సంబంధిత బ్యాంక్ యొక్క పంట రుణాల డేటాను డిజిటల్ సంతకం చేయాల్సి ఉంటుంది.

# ఎగువసభలో తగ్గిన బిజెపి బలం

(మొదటి తరువాయి)

87గా ఉంది. కాంగ్రెస్‌కు 26, తృణమూల్ కాంగ్రెస్‌కు 13, ఆమ్ ఆద్మీ పార్టీ, డీఎంకే పార్టీలకు చెరో 10 మంది చొప్పున రాజ్యసభ ఎంపీలు ఉన్నారు. ఇక ఎన్డీయే, ఇండియా కూటములలో లేని బీఆర్ఎస్ వద్ద నలుగురు, పలువురు స్వతంత్రులు ఉన్నారు. ఎన్డీయే పార్టీలైన టీడీపీ, జేడీయూలతో కలిసి కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన బీజేపీ బలం రాజ్యసభ లోనూ తగ్గింది. నామినేటెడ్ ఎంపీలైన రాకేశ్ సిన్హా, రామ్ షకల్, సోనాల్ మాన్‌సింగ్, మహేశ్ జెఠ్మలానీల పదవీకాలం శనివారంతో పూర్తయింది. అధికార పార్టీ సలహా మేరకు ఈ నలుగురిని రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము రాజ్యసభకు నామినేట్ చేశారు. ఆ నలుగురు ప్రధాని మోదీ సారథ్యంలోని ప్రభుత్వానికి మద్దతుగా నిలిచారు. శనివారంతో వీరి పదవీకాలం ముగిసిపోవడంతో రాజ్యసభలో బీజేపీ ఎంపీల సంఖ్యాబలం 86కి పడిపోయింది. పర్యవసానంగా మొత్తం 245 మంది సభ్యులు ఉన్న రాజ్యసభలో ఎన్డీయే కూటమి సంఖ్యాబలం 101కి పడిపోయింది. రాజ్యసభ మెజారిటీ మార్క్ 113 కంటే ఎన్డీయే ఎంపీల సంఖ్య ఇంకా తక్కువగానే ఉంది. ఎగువ సభలో సంఖ్యా బలం తగ్గడంతో అధికార ఎన్డీయే కూటమి బిల్లులను ఆమోదం కోసం ఇతర పార్టీలపై ఆధారపడాల్సి ఉంటుంది. తమిళనాడులోని అన్నాడీఎంకే, ఆంధ్రప్రదేశ్‌లోని వైఎస్సార్‌సీపీ వంటి పార్టీలను ఆశ్రయించాల్సి ఉంటుందని రాజకీయ నిపుణులు విశ్లేషిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ వద్ద 11, అన్నాడీఎంకే వద్ద 4 మంది సభ్యులు ఉన్నారు. ఎన్నికల సమయంలో టీడీపీ-జనసేనతో బీజేపీ కలవడంతో వైసీపీ దూరమైనప్పటికీ మళ్లీ ఆ పార్టీని బీజేపీ సంప్రదించాల్సిన పరిస్థితి రావొచ్చని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో కూడా వైసీపీ ఇదే పనిచేసింది. బీజేపీ ప్రభుత్వానికి అనేక బిల్లుల విషయంలో మద్దతు తెలిపింది. కాబట్టి మరోసారి బిల్లుల విషయంలో వైసీపీని బీజేపీ సంప్రదించే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఒడిశా మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ సారథ్యంలోని బీజేపీ కూడా గతంలో ఇదే విధంగా బీజేపీకి మద్దతు ఇచ్చింది. అయితే రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ చేతిలోనే ఆ పార్టీ ఓడిపోయింది. కాబట్టి ఇప్పుడు బీజేపీకి బీజేడీ సభ్యులు మద్దతు ఇవ్వడం సందేహమేనని చెప్పాలి. బీజేడీ వద్ద 9 మంది రాజ్యసభ ఎంపీలు ఉన్నారు.

# స్థానిక ఎన్నికలపై సీఎం రేవంత్ దృష్టి


(మొదటి తరువాయి)



అందుకు ఎంత సమయం తీసుకుంటారని సీఎం అధికారులను ప్రశ్నించారు. కర్ణాటకలో 2015 లో, బిహార్‌లో 2023లో కుల గణన చేశారని, ఆంధ్రప్రదేశ్‌లో కుల గణన చేసిన వివరాలు ఇంకా బయటపెట్టలేదని అధికారులు వివరించారు. 2011లో కేంద్ర ప్రభుత్వం అనుసరించిన కుల గణన ఫార్మాట్ 53 కాలమ్స్‌తో ఉందని, దానికి మరో మూడు కాలమ్స్ జోడించి కుల గణన చేపడితే కనీసం అయిదున్నర నెలల సమయం పడుతుందని అధికారులు వివరించారు. బీసీ రిజర్వేషన్ల పెంపుతో పాటు స్థానిక సంస్థలకు కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు ఆగిపోకుండా త్వరగా ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన ప్రణాళిక సిద్ధం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. సమావేశంలో రిజర్వేషన్ల పెంపు అంశంపై సుదీర్ఘ చర్చ సాగింది. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనరసింహ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, రాష్ట్ర మాజీ మంత్రి కె.జానారెడ్డి, బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ రిజర్వేషన్ల పెంపు సాధ్యాసాధ్యాలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఉమ్మడి రాష్ట్రం నుంచి తెలంగాణలో జరిగిన పంచాయతీ ఎన్నికల వరకు అనుసరించిన విధానాలు, వివిధ రాష్ట్రాల స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టులో దాఖలైన కేసులు, వాటి తీర్పులు, పర్యవసానాలను మాజీ మంత్రి జానారెడ్డి వివరించారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందిస్తూ పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్ల అమలుకు ఇప్పటి వరకు అనుసరించిన విధానాలపై కాల క్రమ పట్టిక రూపొందించాలని, ఏవైనా సందేహాలు వస్తే మాజీ మంత్రి జానారెడ్డితో పాటు పంచాయతీరాజ్ శాఖ నిపుణులు, మాజీ ఉన్నతాధికారుల సలహాలు తీసుకోవాలని, చట్టపరమైన విషయాల్లో అడ్వకేట్ జనరల్‌తో చర్చించాలని సూచించారు.

# ప్రజాస్వామ్యానికి గంతలు కట్టి కొల్లగొట్టారు


(మొదటి తరువాయి)



అని చూపించి కొట్టేయాలని చూశారన్నారు. చివరకు సుప్రీకోర్టుకు వెళ్లారన్నారు. హయగ్రీవ భూములు అప్పటి స్థానిక ఎంపీ, శారధాపీఠం, షాహీ హియరింగ్ కాలనీల పేరుతో కొట్టేయాలని చూశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దస్పల్లా భూములు బలవంతంగా ట్విస్ట్ చేసి అక్కడ భూములు కొట్టేసి నిర్మాణాలు చేశారన్నారు. ఎంవీవీ, ఎంవీకే హౌసింగ్ పరుతో అసంబద్ధమైన ఒప్పందాలు చేసుకొని కొట్టేశారని ఆరోపించారు. ఒంగోలులో ఎన్నో ఫేక్ డాక్యుమెంట్లు సృష్టిస్తే 77 మందిపై కేసులు పెట్టారన్నారు. ఇది ఇన్వెస్టిగేషన్‌లో ఉందని తెలిపారు. తివరుకు తిరుపతిలో సెటిల్మెంట్ ల్యాండ్‌లు, మఠం భూములను 22ఏ ఉపయోగించి కొట్టేశారన్నారు. ఎవ్వరి భూమి అయినా 22ఏ పెట్టి వీరు రిజిష్ట్రేషన్ చేయించుకొని మార్చేశారని తెలిపారు. 982ఎకరాలు పుంగనూరులో అరాచకంగా ఇచ్చేశార న్నారు. రైత్వారీ పట్టాలు ఇచ్చి ఇచ్చేశారని.... అది పెద్దిరెడ్డి నియోజకవర్గమని వెల్లడించారు. 10 వేల ఎకరాలు ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ భూములు ఎస్సైన్డ్ ల్యాండ్ పేరుతో లాగేశారని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. వైసీపీ ప్రభుత్వం హయాంలో జరిగిన అవినీతి లెక్కలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బయటపెడుతున్నారు. ఇందులో భాగంగానే శ్వేతపత్రాలను విడుదల చేస్తున్నారు. తాజాగా సహజ వనరులైన భూములు, గనులు, అటవీ సంపదపై విడుదల చేశారు. స్వయంగా సీఎం చంద్రబాబు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. గత ప్రభుత్వం అవినీతి ద్వారా సహజ వనరులు ఎలా దోచుకుంది..? పర్యవరణానికి ఎలాంటి ఇబ్బందులు గురించేసింది..? అనే విషయాలను పూసగుచ్చినట్లుగా వివరిస్తున్నారు. గత ఐదేళ్లుగా జగన్ ప్రభుత్వం సహజవనరులు దోపిడీ చేసిందని మండిపడ్డారు. గత ప్రభుత్వం అడవులను కూడా ధ్వంసం చేసిందని ఆరోపించారు. భూములు, ఖనిజాలు, అటవీ సంపద దోపిడీ జరిగిందని, వైసీపీ ప్రభుత్వం కొత్త విధానంతో దోపిడీ జరిగిందని విమర్శలు చేశారు. విశాఖ, ఒంగోలు, చిత్తూరులో భూకబ్జాలు చేశారని ఆరోపించారు. ఇళ్ల నిర్మాణం పేరుతో వైసీపీ నేతలు దందాలకు దిగారని సీఎం చంద్రబాబు ఆరోపణలు చేశారు. అవినీతి ద్వారా సహజవనరులు ఎలా దోచు కుంటారు, పర్యావరణానికి ఎలాంటి ఇబ్బందులు తెస్తారో చూశాం. గత ప్రభుత్వంలో పంచభూతాలను దోపిడి చేశారు. భూములు లిటిగేషన్ తెచ్చి కొట్టేయడం. గతంలో ఇండియన్ ఫారెస్ట్ సర్వీసును సైతం ఏర్పాటు చేసి అడవులకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చాం. అయితే ఇప్పుడు అడవులను కూడా వైసీపీ నేతలు ధ్వంసం చేశారు. ఇప్పుడు నేను చెప్పే రికార్డులు ఒకవంతు అయితే వాస్తవానికి మూడు, నాలుగు రెట్లు విధ్వంసం జరిగింది.

# రైతు ఋణ మాఫీ మార్గదర్శకాలు కావవి రైతులను మభ్యపెట్టేందుకు ప్రయత్నాలు

**-ప్రభుత్వ విధానాలు కొండను తవ్వి ఎలుకను పట్టినట్లు ఉంది**
**మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి**




వనపర్తి జులై 15( చైతన్య గళం): కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసిన రుణమాఫీ మార్గదర్శకాలపై మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యవసాయం, రైతాంగం బాగుండాలని, తద్వారా విరివిగా ఉపాధి అవకాశాలు లభించాలని కేసీఆర్ ప్రభుత్వం వ్యవసాయానికి ఉచిత కరెంటు, సాగునీళ్లు, రైతుబంధు, రైతుబీమా, రుణమాఫీ పథకాలకు శ్రీకారం చుట్టింది. ఉమ్మడి రాష్ట్రంలో రైతులు, వ్యవసాయ రంగాల కష్ట, నష్టాల మూలంగా అనేకమంది రైతులు ప్రాణాలను కోల్పోయారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో తెలంగాణ రైతులు, వ్యవసాయమే ఇరుసుగా పనిచేశాయి అని గుర్తు చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో పడిన రైతుల రుణభారాన్ని తొలగించడం మూలంగానే రైతు కుదుటపడతాడు, వ్యవసాయం సుస్థిరం అవుతుందని భావించి కేసీఆర్ రెండు విడతలుగా రుణమాఫీ ప్రక్రియకు శ్రీకారం చుట్టారని ఆయన తెలిపారు. మొదటి విడతలో 35.31 లక్షల మంది రైతులకు రూ. 16,144 కోట్లు రుణమాఫీ చేశారు. రెండో విడతలో 22.98 లక్షల రైతులకు చెందిన రూ.13,000 కోట్లు రుణమాఫీ చేయడం జరిగింది. ఎన్నికల కోడ్ వచ్చే వరకు కేసీఆర్ ప్రభుత్వంలో మిగిలిపోయింది రూ. 6440 కోట్లు మాత్రమే అని అన్నారు. మొత్తం రెండు విడతలలో బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 29,144 కోట్లు రుణమాఫీ చేసిందని, అయితే ఎన్నికల్లో కేసీఆర్ ప్రభుత్వం అసలు రైతులకు రుణాలే మాఫీ చేయనట్లు కాంగ్రెస్ పార్టీ దుష్ప్రచారం చేసిందని మండిపడ్డారు. తాము అధికారంలోకి వస్తే ఇలా ఎన్నికలు అయిపోగానే అలా డిసెంబరు 9న రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ తమ ఎన్నికల ప్రచారంలో రాష్ట్రంలో ఉన్న 69 లక్షల పైచిలుకు ఉన్న తెలంగాణ రైతాంగంలో ఆశలు రేపిందని గుర్తు చేశారు. అందరి రుణాలను మాఫీ చేస్తామని ఆ రోజు బహిరంగంగా చెప్పారు. కానీ ఈరోజు కొందరికే పరిమితం చేసేందుకు మార్గదర్శకాలు తీసుకువచ్చారని నిరంజన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ రోజుల్లో 5 ఎకరాల వ్యవసాయదారుడు, 30 వేల జీతం చేసే ఉద్యోగి కూడా ట్యాక్స్ పరిధిలోకి వస్తున్నాడు. రేషన్ కార్డు, పీఎం కిసాన్ డాటా వంటివి పెట్టి కొందరినే రుణమాఫీకి పరిమితం చేస్తున్నారు. రుణమాఫీ చేశాం అన్న ప్రచారం చేసుకోవడానికి ప్రభుత్వ ప్రయత్నాలు తప్ప రైతాంగం బాగుండాలని, వ్యవసాయం బాగుండాలి అన్న సంకల్పం ఈ ప్రభుత్వానికి లేదన్నారు. అసలు రాష్ట్రంలో రూ. 2 లక్షల రుణం పొందిన రైతులు ఎంత మంది ఉన్నారో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. పీఎం కిసాన్ డాటాను మార్గదర్శకంగా తీసుకుంటామని ఎన్నికల ప్రచారంలో చెప్పలేదు, అసలు దానికి సంబంధించిన షరతులే లోపభూయిష్టం అయినవి అన్నారు. రుణమాఫీకి పీఎం కిసాన్ డేటాను అనుసరించడం అంటే రుణమాఫీ లక్ష్యానికి గండికొట్టడం అన్నారు. రైతాంగాన్ని వంచించడమే హామీలు ఇచ్చినప్పుడు లేని ఆంక్షలు అమలు చేసేటప్పుడు ఎందుకు అని ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు. ఈ ఆంక్షలు విధించడానికి ఈ ఏడు నెలల సమయం ఎందుకు తీసుకున్నట్లు అని ప్రశ్నించారు. నాడు పరుగెత్తి రుణాలు తీసుకోండి వెంటనే రుణమాఫీ చేస్తామని రైతులను పరుగులు పెట్టించి నేడు చావు కబురు చల్లగా చెబుతున్నారని మండిపడ్డారు. తెల్లరేషన్ కార్డు ప్రామాణికం కాదని సీఎం రేవంత్ ఇటీవలే ప్రకటించాడు.. సరిగ్గా నాలుగు రోజులు తిరగక ముందే నాలుక మడతేశాడు. గత ప్రభుత్వాలు కేవలం కుటుంబాలను గుర్తించడానికి మాత్రమే రేషన్ కార్డులను పరిశీలించేవారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పది ఎకరాలుండి పింక్ కార్డులు ఉన్న రైతులందరికీ రుణమాఫీ వర్తించదా? మరి రేషన్ కార్డులు లేని రైతుల పరిస్థితి ఏంటి అని ప్రశ్నించారు. రుణమాఫీపై రైతుల నుండి ఫిర్యాదులను కోరడం అంటే రైతుల మధ్య వివాదాలను సృష్టించడమే అన్నారు. ఎన్నికల్లో ఆశ చూపి అధికారం దక్కించుకున్న కాంగ్రెస్ అధికారం వచ్చాక హామీల నుండి తప్పించుకునేందుకు సాకులు వెతుకుతుందని విమర్శించారు. పీఎం కిసాన్ డాటా ఉంటే మళ్లీ రుణమాఫీ అమలుకు వ్యవసాయ అధికారులను బాధ్యులను చేయడం ఎందుకు? రైతుల నుండి ఫిర్యాదులు ఆహ్వానించడం ఎందుకు? తెల్ల రేషన్ కార్డు ప్రామాణికత ఎందుకు అని ప్రభుత్వాన్ని నిలదీశారు. అసలు ప్రభుత్వానికి రుణమాఫీ విషయంలో చిత్తశుద్ధి లేకనే గందరగోళంగా రుణమాఫీ మార్గదర్శకాలు నిర్ణయించిందని తెలిపారు. అధికారులు, రైతుల మధ్య ఈ మార్గదర్శకాలు చిచ్చుపెట్టేలా ఉన్నాయి అని ఆరోపించారు. ఈ విధానం మూలంగా అధికారుల మీద రాజకీయ వత్తిళ్లు పెరుగుతాయి అని, కాంగ్రెస్ మోసాలకు భవిష్యత్‌లో కర్షకులు గుణపాఠం చెబుతారని నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు.

## అమ్మ మాట అంగన్వాడి బాట



అచ్చంపేట జూలై 15 (చైతన్య గళం): నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో అచ్చంపేట టంగాపూర్ కాలనీ 10 మరియు18వ సెంటర్ల పరిధిలో అమ్మ మాట అంగన్వాడి బాట కార్యక్రమంలో భాగంగా ఈరోజు కార్యక్రమంలో భాగంగా రెండున్నర సంవత్సరంలో నుండి ఐదు సంవత్సరాల లోపు పిల్లలను అంగన్వాడి కేంద్రాలలో చదివించాలని మరియు మధ్యలో చదువు మానేసిన బాలబాలికలను తిరిగి పాఠశాలల్లో చేర్పించాలని పురవీధుల గుండా ర్యాలీ తీసి ప్రజలకు అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో టంగాపూర్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాంగీర్, రామచంద్రయ్య, పాఠశాల సిబ్బంది మరియు అంగన్వాడి టీచర్స్ సంధ్య, సుగుణ బాలబాలికలు తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా రావుల రాఘవయ్య వర్ధంతి



కుత్బుల్లాపూర్ జూలై 15(చైతన్య గళం): రావుల రాఘవయ్య ఏడవ వర్ధంతి సందర్భంగా తన స్వగ్రామం నాగార్జునసాగర్ నియోజకవర్గం పెద్ద దేవులపల్లి గ్రామంలో ఏర్పాటు చేసినటువంటి స్థూపం దగ్గర గ్రామస్తులతో కలిసి బిజెపి నాయకులు గాజులరామారం కార్పొరేటర్ రావుల శేషగిరి ఘనంగా నివాళి అర్పించారు ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు,గ్రామ ఎంపీటీసీ అంబటి రాము,సిపిఎం సీనియర్ నాయకులు లక్ష్మయ్య మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## కుత్బుల్లాపూర్ అభివృద్ధికి సహకరిస్తా



కుత్బుల్లాపూర్ జూలై 15 (చైతన్య గళం) రాష్ట్ర మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి సునీత రావు ను మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది.కుత్బుల్లాపూర్ బి బ్లాక్ లో జరుగుతున్నటువంటి రాజకీయ పరిస్థితులపై మాట్లాడడం జరిగినది.మేడ్చల్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రాజనొళ్ల లక్ష్మి ,జిల్లా మహిళా కాంగ్రెస్ కార్యదర్శి జాజాల రమ్య,బి బ్లాక్ ప్రధనాధ్యక్షురాలు M.దుర్గ,బి బ్లాక్ ఉపాధ్యక్షురాలు యాశ్మీన్ సుల్తానా,129 డివిజన్ అధ్యక్షురాలు అమ్మాజీ , ఏ బ్లాక్ ఆర్గనైజింగ్ కార్యదర్శి జాజాల అర్చన తదితరులు పాల్గొన్నారు.

## ఎస్పీని సన్మానించిన సమాజ్ వాది పార్టీ నాయకులు



వనపర్తి జులై 15 (చైతన్య గళం): వనపర్తి జిల్లా ఎస్పీగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆర్. గిరిధర్ ను సోమవారం వనపర్తి జిల్లా సమాజ్ వాది పార్టీ నాయకుడు రాములు శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ వనపర్తి జిల్లా ఏర్పడి ఎనిమిది సంవత్సరాలు పూర్తవుతున్న జిల్లాలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ లేదని దానిని వెంటనే ఏర్పాటు చేయాలని ఎస్పీ ని కోరినట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలో పెరిగిన ట్రాఫిక్ కు అనుగుణంగా మరికుంట, అంబేద్కర్ చౌక్, వివేకానంద చౌరస్తా, కొత్త బస్టాండ్, గాంధీ చౌక్, భగీరథ చౌరస్తా, కమాన్ చౌరస్తా లలో ట్రాఫిక్ కానిస్టేబుల్, సిగ్నల్స్ ను ఏర్పాటు చేయాలని ఎస్పీకి వినతిపత్రం అందజేసినట్లు సమాజ్ వాది పార్టీ నాయకుడు రాములు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగవరం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎడతెరిపిలేని వర్షాల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలి

**-వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**
**-ఆస్తి నష్టం ప్రాణ నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి**
**-శిథిలావస్థ ఇండ్లల్లో నివాసం ఉంటున్న కుటుంబాలను ఖాళీ చేయించాలి**
**-సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా మురుగు కాలువలను శుభ్రం చేసి దోమలు వ్యాప్తి చెందకుండా పారిశుధ్య చర్యలు చేపట్టాలి**
**-అధికారులకు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఆదేశాలు**



వనపర్తి జులై 15 (చైతన్య గళం): ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయని అధికారులు అప్రమత్తంగా ఉండి తగు ముందస్తు చర్యలు తీసుకోవాలని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అధికారులను ఆదేశించారు. వనపర్తి నియోజకవర్గం పరిధిలోని అన్ని మండలాల తహసీల్దార్‌లు ఎంపీడీవోలు , మున్సిపల్ కమిషనర్లతో ఆయన ఫోన్లో మాట్లాడుతూ... వర్షాలపై తగు సూచనలు, చేశారు. మరో మూడు , నాలుగు రోజులు వర్షాలు పడే అవకాశం ఉందని ఎక్కడ కూడా ఆస్తి నష్టం, ప్రాణనష్టం జరగకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాలు, మున్సిపాలిటీలలో పాత ఇండ్లల్లో, మట్టి మిద్దెలలో నివాసం ఉంటున్న వారిని గుర్తించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు.
మురుగు కాలువలు శుభ్రం చేయించాలని , లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వకుండా చూడాలన్నారు. ఈగలు, దోమలు వ్యాప్తి చెందకుండా ప్రజలు అంటు రోగాల బారినపడకుండా గ్రామాలు, పట్టణాలలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఎక్కడ కూడా విద్యుత్ సమస్య తలెత్తకుండా చూసుకోవాలని , ఎక్కడైనా ఎలాంటి సమస్యలు తలెత్తిన తనతో పాటు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

## అక్రమ అరెస్టులను ఖండించిన బచ్చు రాము



వనపర్తి జులై 15 (చైతన్య గళం): డీఎస్సీ అభ్యర్థుల సెక్రటేరియట్ ముట్టడిలో భాగంగా నిరుద్యోగులను పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కి తరలించడానికి బిజెపి వనపర్తి పట్టణ అధ్యక్షుడు బచ్చు రాము ఖండించారు. న్యాయమైన తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ శాంతియుతంగా ఆందోళన చేస్తున్న నిరుద్యోగులను అరెస్టు చేసి అక్రమ కేసులను బనాయించడం సరి కాదని, అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామని బచ్చు రాము అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కళ్ళు తెరవాలని అసెంబ్లీ ఎన్నికలలో నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు ప్రతి ఒక్కరికి ఉందని ప్రశ్నించే గొంతుకలను ఆపాలని చూస్తే రాష్ట్ర ప్రభుత్వానికి బిజెపి ఆధ్వర్యంలో తగిన గుణపాఠం చెబుతామని బచ్చు రాము హెచ్చరించారు. అరెస్టు చేసిన వారిలోమాజీ కౌన్సిలర్ సీతారాములు, సూగురు రాములు, రాయన్న సాగర్, జ్ఞానేశ్వర్, గోవిందు, అరవింద్, శివ తదితరులు ఉన్నారు.

## అచ్చంపేట మున్సిపాలిటీ సాధారణ సర్వసభ్య సమావేశాలు



అచ్చంపేట జూలై 15 (చైతన్య గళం): నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట మున్సిపాలిటీ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని సోమవారం మున్సిపాలిటీ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు అధ్యక్షత నిర్వహించారు. ఈ సాధారణ సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని పట్టణంలోని డ్రైనేజ్ కాలువల మురుగునీరు రోడ్ల పై పారకుండా ఎప్పటి కప్పుడు శుభ్రం చేయాలని అన్నారు. వర్షాకాలంలో ఎదురయ్యే పరిస్థితులను ఎప్పటికప్పుడు మున్సిపల్ అధికారులకు, ప్రజా ప్రతినిధులకు తెలియజేస్తూ పట్టణంలోని ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పనిచేయాలని అధికారులను ఆదేశించారు. తాగునీరు, విద్యుత్తు సరఫరాలో అంతరాయం, రహదారుల పై నీరు నిలవడం, రోడ్ల పై గుంతలు, మ్యాన్‌హోళ్ల మరమ్మతులు, డ్రైనేజ్ పూడికతీత, ఇతరత్రా సమస్యలు ఉత్పన్నం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఎస్.డి.ఎం లా కళాశాలల్లో కొత్త క్రిమినల్ లా గురించి అవగాహన సదస్సు

### -ముఖ్య అతిథులుగా పాల్గొన్న ప్రొఫెసర్ ఎన్. వెంకటేశ్వర్లు




**వనపర్తి జులై 15 (చైతన్య గళం):**
వనపర్తి జిల్లా ఎస్.డి.ఎం లా కళాశాలల్లో కొత్త క్రిమినల్ చట్టాల గురించి సోమవారంనాడు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రొఫెసర్ వెంకటేశ్వర్లు, జాయింట్ సెక్రటరీ (లీగల్ బ్యూరో) UGC, ంరియు Dr N. రాంప్రసాద్, చైర్మన్ బోర్డ్ ఆఫ్ స్టడీస్ ఆఫ్ లా, పాలమూరు విశ్వవిద్యాలయం వారు పాల్గొని కొత్త క్రిమినల్ చట్టాల గురించి వారి అమూల్యమైన సందేశంతో లా విద్యార్థులకు అవగాహన కల్పించారు, కళాశాలలో ఉండే విద్యార్థులను కళాశాలలో సౌకర్యాలను అన్నిటిని పరిశీలించి, చాలా అద్భుతంగా ఉన్నాయి వీటన్నింటినీ సద్వినియోగం చేసుకోవాలి అన్ని వారు విద్యార్థులతో మాట్లాడారు, రాబోయే రోజుల్లో కాలేజీ యొక్క పేరు ప్రతిష్టలు వచ్చే విధంగా మీరు కష్టపడాలి వచ్చే విద్యార్థులకు మార్గదర్శకులుగా ఉండాలి అని సూచించారు ఈ కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహించి నటువంటి కె. భాస్కర్,సెక్రటరీ ఆఫ్ ఎస్.డి.ఎం లా కళాశాల వనపర్తికి విద్యార్థులు అభినందనలు తెలిపారు

## మొక్కలే మానవాళికి జీవనాధారం

### -జస్ట్ యూనియన్ బాలనగర్ మండల అధ్యక్షుడు లక్ష్మణ్ నాయక్



**బాలానగర్ జులై 15( చైతన్య గళం):**
నేటి మొక్కలే రేపటి భవిష్యత్తుకు జీవనాధారం అని జస్ట్ జర్నలిస్టుల సంక్షేమ సంఘం బాలనగర్ మండల అధ్యక్షుడు లక్ష్మణ్ నాయక్ అభిప్రాయపడ్డారు. సోమవారం ఈమెరకు ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటి నీరు పోశారు. అధికారులతో కలిసి మొక్కలు నాటడం సంతోషంగా ఉందని జర్నలిస్టు లక్ష్మణ్ నాయక్, ప్రధాన కార్యదర్శి మల్దే శ్రీశైలం తదితరులు తెలిపారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. తమ యూనినాధ్వరంలో అనేక సార్లు మొక్కలు నాటడం జరిగిందని, పలు సేవా కార్యక్రమాలు చేయడం జరిగిందని లక్ష్మణ్ నాయక్ గుర్తు చేశారు.భవిష్యత్తులో కూడా మరిన్ని సేవా కార్యక్రమాలు చెట్లు నాటే కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, జర్నలిస్టులు శేఖర్ రెడ్డి, నవీన్ కుమార్, బసవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## చిత్రలేఖన పోటీలలో ప్రతిభను కనబర్చిన నందివనపర్తి స్కూల్

### -విద్యార్థిని మనీషా 9వ తరగతి






**ఎల్ బి నగర్, జులై 15( చైతన్య గళం):**
ఎల్బీనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ జనాభా దినోత్సవ సందర్భాన్ని పురస్కరించుకొని జిల్లా స్థాయి పోస్టర్ మేకింగ్ చిత్రలేఖన పోటీలు నిర్వహించడం జరిగింది. అందులో యాచారం మండలం, నందివనపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కు చెందిన 9వ తరగతి ఆంగ్ల మాధ్యమంలో చదువుచున్న విద్యార్థిని మనీష మొదటి బహుమతి సాధించి, నగదు రూపాయలు 500/- పారితోషకం పొందింది. ఈ కార్యక్రమం లో ఎల్ బి నగర్ పాఠశాల గెజిటెడ్ హెడ్మాస్టర్ (రాజస ప్రధానోపాధ్యాయులు) అరుణ్ , ఎఎంఓ (అసిస్టెంట్ మానిటరింగ్ ఆఫీసర్) జయచంద్రారెడ్డి, తెలుగు ఉపాధ్యాయులు ఇన్నపంజీ వెంకటేశం పాల్గొన్నారు.

# తెలంగాణలో డిక్టేటర్స్ పాలన

### -బీఆర్ఎస్‌పై చిన్నారెడ్డి ఫైర్



**హైదరాబాద్ జులై 15 (చైతన్య గళం):**
పదేళ్లుగా తెలంగాణలో డిక్టేటర్స్ పాలన నడిచిందని.. కేసీఆర్ ఇనుపకంచలు వేసి ప్రగతి భవన్ రానీయకుండా చేశారని తెలంగాణ ప్రణాళిక బోర్డు ఉపాధ్యక్షులు జి. చిన్నారెడ్డి అన్నారు. బుల్డోజర్లు పెట్టి రేవంత్ రెడ్డి ఇనుపకంచెలు తొలగించారని తెలిపారు. కృత్రిమ ఉద్యమాలను మాజీ సీఎం కేసీఆర్ సృష్టిస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్ చిల్లర రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. 30 లక్షల ఉద్యోగాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని హామీ ఇచ్చారు.విద్యార్థులు తప్పుదోవ పట్టొద్దు..స్కిల్ డెవలప్మెంట్ సెంట్రల్ ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. విద్యా, వైద్యం, వ్యవసాయం ప్రధాన ప్రాధాన్యతగా ప్రభుత్వం ముందుకెళ్తుందని వివరించారు. గత ప్రభుత్వం ఖజానా పూర్తిగా ఖాళీ చేసి వెళ్లిపోయిందని ధ్వజమెత్తారు. ఇలాంటి పరిస్థితుల్లో కూడా ప్రభుత్వం ఎంతో గొప్పగా కార్యక్రమాలు నిర్వహిస్తోందని.. దీన్ని ఆలోచించాలని అన్నారు. విద్యార్థులు తప్పుడు మాటలు వినద్దొని. తప్పుదోవ పట్టద్దొని చెప్పారు. ఈ ప్రభుత్వం నిరుద్యోగులు, విద్యార్థులకు అండగా ఉంటుందని మాటిచ్చారు.

**-బీఆర్ఎస్ రెచ్చ గొడుతోంది..**

నిరుద్యోగ యువకులు కొందరి ప్రొద్బలం వల్ల ఆందోళనలు చేస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ నేతలు రెచ్చ గొట్టి విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడొద్దని హితవు పలికారు. విద్యార్థుల బలిదానం, త్యాగాలను గుర్తించి తెలంగాణను ఏఐసీసీ అగ్రనేత సోనియాగాంధీ ఇచ్చారని గుర్తుచేశారు. ఈరోజు(సోమవారం) తెలంగాణ సచివాలయం మీడియా పాయింట్‌లో చిన్నారెడ్డి పలు కీలక విషయాలు వెల్లడించారు. లక్ష 7వేల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని ఆ రోజు మాజీ సీఎం కేసీఆర్ చెప్పారని తెలిపారు.

**-కేసీఆర్ ప్రభుత్వం ఉద్యోగాలు భర్తీ చేయలేదు..**

వాటిని భర్తీ చేయక ఆయన దిగిపోయే నాటికి చనిపోయే వాటిని కలుపుకుంటే రెండు లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని అన్నారు. నిరుద్యోగుల పైన ప్రేమ ఉంటే ఉద్యమంలో విద్యార్థుల ప్రాణత్యాగలతో తెచ్చుకున్న తెలంగాణలో ముఖ్యమంత్రి అయిన మూడు నెలల్లోనే కేసీఆర్ ఉద్యోగాలు నింపి ఉండేవారని.. కాని ఉద్యోగాలు భర్తీ చేయలేదని ప్రశ్నించారు. తెలంగాణలో యూనివర్సిటీల్లో టీచింగ్ స్టాఫ్ లేదని అన్నారు.ఉస్మానియా యూనివర్సిటీ ప్రతిష్ట దెబ్బతినేలా కేసీఆర్ సర్కార్ చేసిందని మండిపడ్డారు.ప్రభుత్వం వచ్చిన వెంటనే 30 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని వివరించారు. గ్రూప్ వన్ నోటిఫికేషన్ వచ్చిందని, పరీక్షలు రాశారని రిజల్ట్స్ కూడా వచ్చాయని తెలిపారు. మెయిన్స్ షెడ్యూల్ కూడా ఇచ్చామని తెలిపారు.శతాబ్ది ఉత్సవాలకు కేసీఆర్‌ను ఉస్మానియాలో యూనివర్సిటీ విద్యార్థులు మాట్లాడనివ్వలేదని గుర్తుచేశారు. ఎన్నికల కంటే ముందు రెండు లక్షల ఉద్యోగాలను ఒక సంవత్సరంలో భర్తీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారని అన్నారు.

**-ఉద్యోగాలపై సీఎం రేవంత్ దృష్టి..**

"పదేళ్లలో 20,000 టీచర్ ఉద్యోగాలు ఖాళీగా ఉంటే ఒక్కటి కూడా గత ప్రభుత్వం భర్తీ చేయలేదు. ఒక్క డీఎస్సీ కూడా వేయలేదు.. పక్కన ఏపీ రాష్ట్రంలో మూడు డీఎస్సీలు వేశారు. ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ పాఠశాల్లో విద్యార్థులకు బీఆర్ఎస్ సర్కార్ అన్యాయం చేసింది. సర్కార్ రాగానే రేవంత్ రెడ్డి ఉద్యోగాలపై దృష్టి సారించారు. నిరుద్యోగుల కోసం 11 వేల పైచిలుకు పోస్టులతో నోటిఫికేషన్ ఇచ్చారు. హాల్ టికెట్లు కూడా విడుదల చేశారు. గత సర్కార్ పదేళ్లలో 5000 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చి నిర్వహించలేకపోయింది. ఈ డీఎస్సీతో పాటు మరో డీఎస్సీని 9,000 తో విడుదలకు నోటిఫికేషన్ ఇస్తాం. క్వాలిటీ టీచర్స్ ఎంపిక కోసం రెండు డీఎస్సీలను నిర్వహించాలనుకుంటున్నాం." అని చిన్నారెడ్డి పేర్కొన్నారు

**-రాష్ట్రాన్ని దివాలా తీయించిన బీఆర్ఎస్**

"తెలంగాణ రాష్ట్రాన్ని పూర్తిగా దోచుకొని రాష్ట్రాన్ని దివాలా తీయించిన బీఆర్ఎస్ నేతలు కేసీఆర్, హరీష్‌రావు, కేటీఆర్ మళ్లీ పిల్లల జీవితాలతో ఆడుకునే ప్రయత్నం చేస్తున్నారు. వాళ్ల చేతుల్లో పావులుగా మారొద్దని విజ్ఞప్తి చేస్తున్నాను. మళ్లీ విద్యార్థులను నిరుద్యోగులను వాడుకొని వదిలేస్తారు. 30 లక్షల మంది చదువుకున్న నిరుద్యోగులు ఎంప్లాయిమెంట్ పోర్టల్లో పేర్లు నమోదు చేసుకున్నారు. టాటా కంపెనీతో ఒప్పందం చేసుకొని 64 ఐటీఐ సెంటర్లలో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లు ఏర్పాటు చేయబోతున్నాం. రూ. 2000 కోట్లు ఐటీఐలకు కేటాయించాం. స్కిల్ డెవలప్మెంట్ ద్వారా ప్రభుత్వ ఉద్యోగాలు కలిపి 30 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తాం" అని చిన్నారెడ్డి తెలిపారు.

**-ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేయొద్దు..**

"ముఖ్యమంత్రి ఇంటికి పోయి ధర్నా చేయడం సరికాదని విజ్ఞప్తి చేస్తున్నాను. కోచింగ్ సెంటర్ల వాళ్లు కొంతమంది విద్యార్థులను ప్రేరేపించి ఆందోళన చేయిస్తున్నారు. ప్రజావాణిలో దరఖాస్తులకు దరఖాస్తు చేసిన 10 రోజుల్లో ఫలితాలు కూడా వస్తున్నాయి. అవసరమైతే అధికారులను అక్కడికి రప్పిస్తున్నాం. విద్యార్థులు, నిరుద్యోగులు బాధ చెప్పుకోవాలనుకుంటే ప్రజావాణికి వచ్చి బాధ చెప్పుకోమని కోరుతున్నాం.. మీకు అన్ని రకాలుగా అండగా ఉంటాం. రాష్ట్ర ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేయొద్దని కోరుతున్నాను. 1: 100, వాయిదా వేయడం, పరీక్షకు పరీక్షకు మధ్య గ్యాప్ వంటి సమస్యలపై కలిసి మాట్లాడితే బాగుండేది. ఫీజు రియింబర్స్‌మెంట్ మొత్తం కూడా త్వరలోనే విడుదల చేయబోతున్నాం" అని చిన్నారెడ్డి పేర్కొన్నారు..

## ఫామ్ ఆయిల్ గురించి రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ ఉద్యాన అధికారులు



**కల్వకుర్తి జులై 15 (చైతన్య గళం):**
కల్వకుర్తి మండలం కల్వకుర్తి గ్రామంలో వనమహొస్థవం సందర్భంగా మెగా ఆయిల్ ఫామ్ ప్లాంటేషన్ లో భాగంగా సత్యనారాయణ వ్యవసాయ క్షేత్రంలో గౌరవ కల్వకుర్తి శాసనసభ్యులు శ్రీ కసిరెడ్డి నారాయణరెడ్డి ఆయిల్ పామ్ మొక్కను నాటడం జరిగింది. ఆయిల్ పామ్ పంట ఒకసారి నాటుకుంటే నాలుగో సంవత్సరం నుండి 30 సంవత్సరాల వరకు రైతుకు స్థిరమైన ఆదాయం వస్తుంది . చీడ, పీడల బెడద తక్కువగా ఉంటుంది. అకాల వర్షాలు వడగండ్లు ఈ పంటపై ఎలాంటి ప్రభావం చూపదు. అంతర పంటలతో రైతులు అదనపు ఆదాయాన్ని పొందవచ్చు. ఆయిల్ పామ్ చట్టం 1993 ప్రకారం ఈ పంటను ఎలాంటి మధ్యవర్తులు లేకుండా ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారము ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది. ఈ పంట టన్ను ధర కూడా ప్రతినెల ప్రభుత్వమే నిర్ణయించడం జరుగుతుంది . ఈ పంట ఒక మొక్క పూర్తి ధర 193 రూపాయలు కానీ ప్రభుత్వం కేవలం 20 రూపాయలకే రైతులకు సబ్సిడీ రూపంలో అందిస్తుంది. డ్రిప్పు కూడా రైతుకు ఎస్సీ,ఎస్టీ రైతులకు 100% సబ్సిడీ, సన్న చిన్న కారు రైతులకు 90% సబ్సిడీ అదేవిధంగా ఐదు ఎకరాల పైబడిన రైతులకు 80 శాతం సబ్సిడీ ప్రభుత్వం అందిస్తుంది. ఈ విధంగా డ్రిప్పు, మొక్కలు మరియు నాలుగు సంవత్సరాల పంట నిర్వహణకై ఒక ఎకరానికి ప్రభుత్వం నుండి 50 వేల 198 రూపాయలు సబ్సిడీ రూపంలో అందించడం జరుగుతుంది. ఈ ఆయిల్ పామ్ తోటల ప్రోత్సాహకం అంతర పంటల సాగుకు రూ.2,100, ఆయిల్ పామ్ తోట యాజమాన్యం కోసం రూ.2,100 మొత్తం కలిపి రూ.4,200 ఒక ఎకరానికి చొప్పున బ్యాంకు ఖాతాల్లో జమ చేయటం జరుగుతుంది. నాగర్ కర్నూల్ జిల్లాలో ఇప్పటివరకు 1508 రైతులకు గాను 5813 ఎకరాలలో ఆయిల్ పామ్ సాగు చేయడం జరుగుతుంది. 2024- 25 ఆర్థిక సంవత్సరంలో 2800 ఎకరాలలో ఆయిల్ ఫామ్ సాగుకై సన్నాహాలు చేయడం జరుగుతుంది ఇప్పటివరకు 612 ఎకరాలలో సాగును చేపట్టడం జరిగింది కావున ఆసక్తిగల రైతు సోదరులు వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్ పామ్ పంట వైపు మొగ్గుచూపాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి , జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ అధికారి డి చక్రపాణి ,కల్వకుర్తి ఉద్యాన అధికారి పి ఇమ్రాన , నాగర్ కర్నూల్ ఉద్యాన అధికారి కె చంద్రశేఖర్ , కొల్లాపూర్ ఉద్యాన అధికారి ఎం లక్ష్మణ్ , అచ్చంపేట ఉద్యాన అధికారి సౌమ్య మరియు ప్రజా ప్రతినిధులు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ని మర్యాదపూర్వకంగా కలిసిన గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి



**శేరిలింగంపల్లి జులై 15( చైతన్య గళం):**
గచ్చిబౌలి డివిజన్ కు విచ్చేసిన కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ని టీఎన్జీవోస్ కాలనిలోని తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుడు విఠల్ ఇంట్లో గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ వి. గంగాధర్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పుష్ప గుచ్ఛం అందజేశారు. అనంతరం పార్టీ కార్యక్రమాలు, అభివృద్ధి పనులపై, కేంద్రం ప్రభుత్వ నిర్ణయాలపై బండి సంజయ్ కుమార్ లతో చర్చించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బొక్క నర్సింహా రెడ్డి , సీనియర్ నాయకులు అంజన్ కుమార్, స్వామి గౌడ్, ఈశ్వర్, గచ్చిబౌలి డివిజన్ ఉపాధ్యక్షులు తిరుపతి, టీఎన్జీవోస్ కాలనీ వాసులు రాజేందర్ యాదవ్ వాసులు లక్ష్మన్, సంపత్, స్థానిక నేతలు,కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.